క్లుప్తంగా

ఆలయానికి రూ.51వేల విరాళం


చెక్కు అందజేస్తున్న మక్కాన్‌సింగ్

గోదావరిఖనిటౌన్: పట్టణంలోని పవర్‌హౌజ్ కాలనీలోని శ్రీ కాశీవిశ్వేశ్వర ఆలయంలో సోమవారం జరిగిన ధ్వజ స్తంభ పునః ప్రతిష్ఠాపన కార్యక్రమానికి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజ్ ఠాకూర్ మక్కాన్‌సింగ్ దంపతులు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయానికి విరాళంగా రూ.51వేల విలువ చెక్కును అర్చకులు వెంకటేశ్వర్లుకు అందజేశారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

కమాన్‌పూర్: మహిళలు స్వశక్తితో ఎదగాలని గుండారం సర్పంచ్ ఆకుల ఓదెలు అన్నారు. గ్రామానికి చెందిన సిరవేణ అనూషకు గ్రామైఖ్య సంఘం రూ. 1.50లక్షలతో ఏర్పాటు చేసిన కంగన్‌హాల్‌ను సోమవారం సర్పంచ్ ప్రారంభించారు. ఏపీఎం శైలజశాంతి, సీసీ ఎల్లమ్మ, వీవో కలవేన రజిత పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

ధర్మారం: మండలంలోని మల్లాపూర్ రైతువేదిక భవనంలో సోమవారం ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు ఉద్యానశాఖ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైంటిస్టు డాక్టర్ బీఎస్‌రావు ఆయిల్‌పామ్ పంటపై వచ్చే చీడపీడల గురించి, మొగిపురుగు, ఆకుమచ్చ, ఆయిల్‌పామ్‌ల వచ్చే వివిధ రకాల చీడలపై సలహాలు, సూచనలు చేశారు. డిప్యూటీ డైరెక్టర్ సోమిరెడ్డి, ఉద్యానశాఖ అధికారులు జ్యోతి, శ్రీకాంత్, రైతుబంధు కోఆర్డినేటర్ గంధం రవీందర్, తిరుమల ఆయిల్‌పామ్ కంపెనీ సీఈవో కేశు కల్యంకర్, వ్యవసాయశాఖ విస్తీర్ణాధికారి ఫీల్డు ఆఫీసర్లు శివకృష్ణ, మహేశ్, హరీశ్, శ్రీధర్, అభిలాష్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణంపై చర్యలు చేపట్టాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కోల్‌సిటీ: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఓ ప్రముఖ రెస్టారెంట్ భవనంపై మున్సిపల్ అనుమతి లేకుండా నిర్మిస్తున్న అక్రమ కట్టడంపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మార్కపురి సూర్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అరుణశ్రీకి వినతిపత్రం అందజేశారు. మార్కపురి సూర్య మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా అనేక అక్రమ కట్టడాలు జరుగుతున్నప్పటికీ, టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఓ రెస్టారెంట్ భవనంపై మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ కట్టడాలు చేపడుతున్నారని, దీనిపై కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదన్నారు. ఆసాల నవీన్, శనిగరపు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పొత్కపల్లి ఎస్సైకి సన్మానం


సన్మానిస్తున్న బీజేవైఎం నాయకులు

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ ఎస్సై నూతి శ్రీధర్‌ను బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కొంగర అనిల్‌యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. నాయకులు కొలిపాక వెంకటి, బండారి శ్రీనివాస్, దేవిడి తిరుపతిరెడ్డి, జక్కుల హరీశ్ ఉన్నారు.

బావుల్లో బ్లీచింగ్ పౌడర్

ఎలిగేడు: వర్షాకాలంలో ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున చేదబావుల్లో వర్షపునీరు వచ్చి చేరుతుండటంతో కలుషితనీటిని నివారించేందుకు సోమవారం మండలంలోని ధూళికట్ట పంచాయతీ ఆధ్వర్యంలో బావుల్లో బ్లీచింగ్ పౌడర్ వేసి క్లోరినేషన్ చేయించారు. సర్పంచ్ గొల్లె కావేరి, కార్యదర్శి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గొర్రెల యూనిట్లు మంజూరు

రామగిరి: మండలంలోని రత్నాపూర్‌కు చెందిన 12 మందికి గొర్రెల యూనిట్లు మంజూరైనట్లు సర్పంచ్ పల్లె ప్రతిమ తెలిపారు. రెండో విడత పంపిణీలో భాగంగా 72 మంది లబ్ధిదారులకు గాను మొత్తం 56 మంది లబ్ధిదారులు డీడీ చెల్లించారు. మిగతా 12 మంది డీడీలు చెల్లించగా వారికి యూనిట్లను పంపిణీ చేయనున్నట్లు సర్పంచ్ తెలిపారు.

సేవా కేంద్రంగా సహకార సంఘం

- కామన్ సర్వీస్ సెంటర్ల ఏర్పాటుకు అనుమతి
- రైతులు, గ్రామీణ ప్రజలకు మేలు



సుల్తానాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం

సుల్తానాబాద్: సహకార సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అన్ని సంఘాల్లో సాధారణ సేవా కేంద్రాలు (కామన్ సర్వీస్ సెంటర్) ఏర్పాటు చేసుకునేందుకు అనుమతిచ్చింది. ఇప్పటికే రైతులకు రుణాలు ఇవ్వడం, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయించడం వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్నాయి. వాటికి మరింత ఆర్థిక బలం చేకూర్చి లాభాల బాట పట్టించేలా నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలోని సుల్తానాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ముందు వరుసలో నిలిచింది. కామన్ సర్వీస్ సెంటర్ ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి

గ్రామీణ ప్రజలకు మేలు..

కామన్ సర్వీస్ సెంటర్‌లు ఏర్పాటు చేస్తే ప్రస్తుతం మీసేవ కేంద్రాల్లో అందించే సేవలన్నీ ప్రజలకు అందుబాటులోకి వస్తాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో మీసేవ కేంద్రాలు లేవు. వివిధ పత్రాలకు దరఖాస్తు చేసుకోవడానికి పట్టణ, మండల కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది. మండల కేంద్రానికి వెళ్లకుండానే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సేవలు పొందేందుకు వెసులుబాటును ప్రభుత్వం కల్పిస్తుంది

బలోపేతం..

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయి. కామన్ సర్వీస్ సెంటర్లు ఏర్పాటు చేసుకోవడానికి ముందుకొచ్చే సంఘాలన్నింటికీ డీసీసీబీ సహకారం అందిస్తుంది. వీటి ఏర్పాటుతో గ్రామీణ ప్రజలకు మేలు కలుగుతుంది.

ఉమ్మడి జిల్లాలో నంబర్ వన్

ఉమ్మడి జిల్లాలోని సుల్తానాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నంబర్ వన్‌గా నిలిచింది. రైతులకు, ప్రజలకు ఇప్పటికే స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు ఇవ్వడమే కాకుండా రికవరీలో నంబర్ వన్‌గా నిలిచింది. వ్యవసాయ రుణాలతో పాటు వ్యాపారులకు రుణాలను అందిస్తుంది. చిరు వ్యాపారులకు రుణాలు ఇవ్వడమే కాకుండా గోల్డ్ లోన్, విద్యార్థులకు విదేశీ విద్య కోసం రుణాలు అందిస్తోంది. ఆడిటింగ్‌లో ఏటా ఏ గ్రేడ్‌లో నిలుస్తున్నామని అధికారులు చెప్పన్నారు.

రైతులకు సేవలు



రైతులకు అవసరమైన నిత్యావసర వస్తువులతో పాటు అన్నిరకాల సేవలు సింగిల్ విండో ఆధ్వర్యంలో వచ్చేలా ఏర్పాటు చేస్తున్నాం. రైతులకు, ప్రజలకు అందుబాటులో సేవలు తీసుకురావడమే మా లక్ష్యం. ఇప్పటికే అన్ని రకాల సేవలు అందిస్తున్నప్పటికీ డిజిటల్ అవుతుండడంతో దానికి తగ్గట్టుగా సింగిల్ విండోను తయారు చేస్తున్నాం.

– శ్రీగిరి శ్రీనివాస్, సింగిల్‌విండో చైర్మన్, సుల్తానాబాద్

ఎన్నికల నిర్వహణపై సమీక్ష


మాట్లాడుతున్న ఆర్డీవో హనుమనాయక్

మంథని: త్వరలోనే జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నిర్వాహణ, శాంతి భద్రతలపై సోమవారం మంథని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్డీవో హనుమనాయక్ సబ్ డివిజన్ పోలీస్ అధికారులు, నియోజకవర్గ ఎక్సైజ్ శాఖతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. ఎన్నికల్లో ఏవిధంగా వ్యవహించాల్సి ఉంటుందో చర్చించారు. ముందస్తు ఏర్పాట్లు, అవసరమైన చర్యలకు సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. టాస్క్‌ఫోర్స్ అసిస్టెంట్ కమిషనర్ మల్లారెడ్డి, గోదావరిఖని ఏసీపీ తులా శ్రీనివాసరావు, సబ్ డివిజన్‌లోని పోలీస్ అధికారులు రామ్‌మోహన్, సతీశ్, నియోజకవర్గంలోని ఎక్సైజ్ అధికారులు ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

రామగిరిలో..

రామగిరి: మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆర్డీవో హనుమనాయక్ ఓటరు జాబితాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాను పకడ్బందీగా నిర్వహించాలని, యువ ఓటర్ల నమోదుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కును వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న రాఫ్ ఖాన్


దరఖాస్తులు అందజేస్తున్న యువకులు

గోదావరిఖనిటౌన్: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని స్వీప్ ఆక్టివిటీస్ జిల్లా నోడల్ అధికారి రాఫ్ ఖాన్ అన్నారు. పట్టణంలోని గాంధీ డిగ్రీ, మహర్షి పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఓటరు నమోదు, ఓటుహక్కు సద్వినియోగంపై అవగాహన కల్పించారు. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కును కలిగి ఉండాలన్నారు.

ఓటరు నమోదుకు యువత నుంచి స్పందన

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో నిర్వహించిన ఓటరు నమోదు, సవరణలకు యువత నుంచి స్పందన వచ్చింది. గత నెల 26, 27వ తేదీల్లో మొదటిసారి ఈ నెల 2, 3 తేదీల్లో రెండోసారి ఓటరు నమోదుకు అవకాశం కల్పించారు. మండలంలో 24 ఓటరు నమోదు కేంద్రాలలో దరఖాస్తులు స్వీకరించారు. త్వరలోనే కొత్త ఓటర్లతో పాటు సవరణలతో ఓటరు జాబితా ప్రకటించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు ఎన్నికల అధికారులు పేర్కొన్నారు. గ్రామాల్లో ఓటరు నమోదు కేంద్రాలను తహసీల్దారు బషీరోద్దీన్ సందర్శించి, సూచనలు చేశారు.

‘డివిజన్లను అభివృద్ధి చేస్తా’


మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: నియోజకవర్గంలోని డివిజన్లను, గ్రామాన్ని అభివృద్ధి బాటలో పయనించేలా కృషి చేస్తానని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 37వ డివిజన్ భరత్‌నగర్‌లో రూ.10లక్షల డీఎంఎఫ్‌డీ నిధులతో మంజూరైన మహిళా భవనం నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజల అవసరాలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గత ప్రభుత్వాల పాలకుల హయాంలో రూ.200 ఉన్న పెన్షన్ ప్రస్తుతం రూ.2వేలకు పెంచి వారికి అండగా నిలిచారన్నారు. నియోజకవర్గంలో పేదప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే దృక్పథంతో ఈ ప్రాంతంలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేశారని కొనియడారు. ప్రజల కోసం అహర్నిశలు శ్రమిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. మేయర్ డాక్టర్ బంగి అనిల్‌కుమార్, కార్పొరేటర్లు పెంట రాజేశ్, వాసు, సతీశ్ పాల్గొన్నారు.

కులవృత్తులకు చేయూత

కులవృత్తులకు రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిస్తోందని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. పట్టణంలోని తిలక్‌నగర్‌లో సోమవారం అఖిలభారత యాదవమహాసభ దశాబ్ది ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత పాలకులు ఎవరూ చేయని విధంగా గొల్లకుర్మల జీవనోపాధికి గొర్రెల పంపిణీ చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. గ్రామంలోని ప్రతి సొసైటీకి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా గొర్రెల పంపిణీ చేసి వారికి ఆర్థిక చేయూత అందించారన్నారు. యాదవ ఆత్మగౌరవ కమ్యూనిటీహాల్ భవన నిర్మాణం కోసం రూ.30 లక్షలు నిధులు కేటాయించామని తెలిపారు. జనగామలో యాదవ సంఘానికి రూ.10లక్షలు, ఎల్కలపల్లి యాదవ సంఘం భవన నిర్మాణానికి రూ.5లక్షలు కేటాయించినట్లు వెల్లడించారు. రామగుండం నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీకి మద్దతుగా నిలిచి రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. యాదవ సంఘం నాయకులు గుంపు ఓదెలుయాదవ్, కార్పొరేటర్లు అడ్డాల స్వరూప, బాల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుట్టలపై సీడ్‌బాల్స్


సీడ్‌బాల్స్ విసురుతున్న బల్దియా సిబ్బంది

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ సిబ్బంది సోమవారం సీడ్ బాల్స్‌ను గుట్టలపై విసిరారు. బల్దియా ఆధ్వర్యంలో హరితహారంలో భాగంగా తయారు చేసిన సుమారు 30వేల సీడ్ బాల్స్‌ను మేయర్ డాక్టర్ అనిల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ నాగేశ్వర్ ఆదేశాల మేరకు రామగుండంలోని రాముని గుండాలు, బిపవర్ హౌజ్ ముందు ఉన్న గుట్టపై సూపర్‌వైజర్ విజయ్ ఆధ్వర్యంలో సిబ్బంది సీడ్‌బాల్స్ విసిరారు. ఐదేళ్లుగా గుట్టలపై సీడ్ బాల్స్ విసురుతుండడం ద్వారా సత్ఫలితాలు వస్తుండడంతో ఈ ఏడాది కూడా సీడ్‌బాల్స్ తయారు చేసి గుట్టలపై విసిరారు.

గ్రామాల్లో రవాణా సౌకర్యాల కల్పనకు కృషి


పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ బాలాజీరావు

సుల్తానాబాద్‌రూరల్: గ్రామాల్లో రవాణా సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ బాలాజీరావు అన్నారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గ్రామంలోని రజీవ్ రహదారి నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఎంపీపీ బాలాజీరావు ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఆర్‌అండ్‌బీ నిధులు రూ.2కోట్లతో నిర్మాణ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి తొమ్మిదేళ్ల పాలనలో నారాయణపూర్, గొల్లపల్లి, గట్టెపల్లి, నీరుకుల్ల, పూసాల, మియ్యాపూర్, సుద్దాల రోడ్డుకు నిధులు మంజూరై పనులు పూర్తయినట్లు తెలిపారు. అనంతరం సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు వీరగోని సునీత, సింగిల్‌విండో చైర్మన్ జూపల్లి సందీప్‌రావు, ఎంపీటీసీ పులి అనూష, ఉప సర్పంచ్ మధు, సింగిల్‌విండో మాజీ చైర్మన్ వీరగోని రమేశ్ గౌడ్, మాజీ ఎంపీటీసీ పులి వెంకటేషం, నాయకులు వడ్కపూరం ఆంజనేయులు, కుందేళ్ల శ్రీనివాస్, కార్యదర్శి ప్రశాంత్ ఉన్నారు.

ఉదయనిధి స్టాలిన్ దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కార్యకర్తలు

ఎలిగేడు: హిందూ సనాతన ధర్మాన్ని పూర్తిగా తొలగించేందుకు తమ ఆశయం కొనసాగిస్తామని తమిళనాడు సీఎం కుమారుడు ఉదయనిధి స్టాలిన్ చేసిన మాటలకు నిరసనగా సోమవారం మండలంలోని ధూళికట్ట ప్రధాన చౌరస్తాలో హిందూవాహిని కార్యకర్తలు ఉదయనిధి స్టాలిన్ దిష్టిబొమ్మ దహనం చేశారు. బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మెండ సాగర్, భూసారపు మహేశ్‌గౌడ్, మారం సాగర్, రమేశ్, మహేశ్, సతీశ్, అజయ్, ఓమేశ్, సాయికిరణ్, ఆంజనేయులు, భూసారపు హిందూవాహిని కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీకి ద్రోహం చేస్తే సహించేది లేదు


మాట్లాడుతున్న ఉద్యమకారులు

మంథని: కాంగ్రెస్ కోవర్ట్‌గా మారిన కొందరు బీఆర్‌ఎస్ పార్టీకి ద్రోహం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని, అలాంటి వారిని సహించేది లేదని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు ఎక్కేటి అనంతరెడ్డి, కావేటి సతీశ్ పేర్కొన్నారు. మంథని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీలో పనిచేయాలని ఉంటే అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉండాలని, లేదంటే నిరభ్యరంతరంగా పార్టీని వీడొచ్చన్నారు. అంతేకానీ కాంగ్రెస్ పార్టీకి మేలు చేయడానికి ఉద్యమ ద్రోహులంతా ఒక్కచోట చేరి పార్టీకి నష్టం చేయడానికి కుట్రలు పన్నితే తరిమికొట్టాల్సి వస్తుందన్నారు. సమావేశంలో ఉద్యమకారుల ఫోరం మంథని మండల అధ్యక్షుడు గోగుల రాజారెడ్డి, జిల్లా కార్యదర్శి కుంట బద్రి, రాష్ట్ర కార్యదర్శి మంథని విజయ్ కుమార్, జిల్లా కార్యదర్శి పొయిల బాపుతో పాటు తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ బడి కూలుతోంది

- నిధులున్నా పనులెందుకు చేయరు..
- పంచాయతీ కార్యాలయం వద్ద చిన్నారులు, గర్భిణుల బైఠాయింపు


పంచాయతీ ఆఫీస్ వద్ద చిన్నారులు, గర్భిణులు

పెద్దపల్లిరూరల్: ‘అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరింది.. మరమ్మతు చేయించండి..’ అంటూ చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పంచాయతీ కార్యాలయానికి చేరి బైఠాయించారు. మండలంలోని నిట్టూరు జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఉన్న అంగన్‌వాడీకేంద్రం భవనం శిథిలావస్థలో ఉండడం.. రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో కూలిపోయే ప్రమాదముందని అగన్‌వాడీ టీచర్ రేణుక ఆవేదన వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ బండారి రామ్మూర్తి తన నిధుల్లోంచి రూ.2లక్షలు కేటాయించారని, పంచాయతీ పాలకమండలిలోనూ ప్రస్తావించామని ఉపసర్పంచ్ గిర్నేని సంపత్‌రావు తెలిపారు. నిధులున్నా జాప్యం చేయడం సరికాదని గ్రామస్తులు అన్నారు. వీలైనంత త్వరగా పనులు ప్రారంభించాలని సర్పంచ్‌కు సూచించామని మండల పరిషత్ అధికారి సుదర్శన్ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

✦శివాలయంలో భక్తుల పూజలు

సుల్తానాబాద్: మున్సిపల్ పరిధిలో ఉన్న పురాతన శివాలయంలో శ్రావణ సోమవారం పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు రకాల పళ్లతో రుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అల్లెంకి సత్యనారాయణ పాల్గొన్నారు.

✦లాలపల్లిలో బోర్‌వెల్ ఏర్పాటు

ఎలిగేడు: మండలంలోని లాలపల్లిలో వాల్మీకి బోయ సంఘానికి సోమవారం ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి బోర్‌వెల్ వేయించారు. బీఆర్‌ఎస్ నాయకులు బద్దం తిరుపతిరెడ్డి, కల్లెం శ్రీనివాసరెడ్డి, సంఘం నాయకులు ఉన్నారు.

✦బీసీ సింహగర్జన విజయవంతం చేయండి

కమాన్‌పూర్: హైదరబాద్‌లో 10వ తేదీన నిర్వహించే బీసీ సంహగర్జనను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం పోస్టర్ ఆవిష్కరించారు.

✦ఏఐసీసీ స్క్రీనింగ్ కమిటీ చైర్మన్‌ను కలిసిన జనక్ ప్రసాద్

గోదావరిఖని: ఏఐసీసీ స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మురళీధర్‌ను ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ సోమవారం కలిశారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఆయనను కలిసి సన్మానించారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఆలిండియా ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షులు చంద్రశేఖరన్, వేణుగోపాల్ ఉన్నారు.

✦పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

రామగిరి: మండలంలోని లద్నాపూర్ గ్రామానికి చెందిన అటుకపురం రేశ్వంత్ తన ఫోన్ ఎక్కడో పడిపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి ఫోన్‌ను గుర్తించి బాధితుడికి సోమవారం ఎస్సై రవిప్రసాద్ అందజేశారు.

✦ఎల్‌ఐసీ ఏజెంట్ల దినోత్సవం

గోదావరిఖనిటౌన్: ఎల్‌ఐసీ వార్షికోత్సం సందర్భంగా సోమవారం స్థానిక కార్యాలయంలో ఏజెంట్స్ డే నిర్వహించారు. ఈ సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన కె.రాజేందర్, టి.శ్రీనివాస్, ఎం.సత్యనారాయణ, డి.నర్సింగం, పోలె రాజును సన్మానించారు. శాఖ కార్యనిర్వహణ అధికారి నందిగామ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ మాదాసు నాగేంద్రకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

✦ధరల నియంత్రణలో కేంద్రం విఫలం

కాల్వశ్రీరాంపూర్: కేంద్ర ప్రభుత్వం ధరల పెరుగుదలను నియంత్రించడంలో విఫలమైందని ఆరోపిస్తూ సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యంరావు, వ్యవసాయ కార్మికశాఖ జిల్లా అధ్యక్షుడు మంద రాజేందర్ కాల్వశ్రీరాంపూర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. అనంతరం ఆర్‌ఐ వైష్ణవికి వినతిపత్రం ఇచ్చారు.


✦స్వర్ణకారుల దీక్షకు నేతల మద్దతు

పెద్దపల్లిరూరల్: స్వర్ణకార వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారికి న్యాయం చేయాలంటూ స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం దీక్ష చేపట్టారు. పట్టణంలోని మసీద్ వద్ద చేపట్టిన దీక్షా శిబిరాన్ని బీజేపీ నాయకులు గొట్టిముక్కల సురేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావుతో పాటు నాయకులు మందల సత్యనారాయణరెడ్డి, నల్ల మనోహర్‌రెడ్డి మద్దతు తెలిపారు.

✦విజయానంద్‌కు సన్మానం

మంథని: గోదావరిఖనికి చెందిన ప్రముఖ వక్త, కవి, రచయిత మల్లావజ్జుల విజయానంద్‌ను మంథని సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ సోమవారం సన్మానించారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి


వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

పెద్దపల్లిరూరల్: సమగ్రశిక్ష శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న తమను పర్మినెంట్ ఉద్యోగులుగా ప్రకటించాలని డీఈవో మాధవి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి సోమవారం వినతిపత్రాలు అందించారు. వారం రోజులుగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా పాలకులు స్పందించడంలేదని సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశం అన్నారు. 11వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు పేర్కొన్నారు. నాయకులు రవిరాజ్, కుమారస్వామి, రాజ్‌కుమార్, సంపత్, నాగరాజు, రమేశ్, శంకర్ ఉన్నారు.


పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవాలి

పెద్దపల్లిరూరల్: చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పవతి అన్నారు. పెద్దపల్లి మండలం అప్పన్నపేటలో సోమవారం పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మందల విమల, శంకరమ్మ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత లేకుండా చూసుకోవాలి


ఎలిగేడు: మహిళలు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, తల్లులు, పిల్లలు రక్తహీనత లేకుండా చూసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సూర్యకళ సూచించారు. మండల కేంద్రంలోని ఒకటో అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ మాసం నిర్వహించారు. అనంతరం మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. అంగన్‌వాడీ టీచర్ జ్యోతి పాల్గొన్నారు.

కాంగ్రెస్ సుల్తానాబాద్ మండల అధ్యక్షుడిగా సతీశ్


చిలుక సతీశ్


సుల్తానాబాద్: కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా తొగర్రాయి గ్రామానికి చెందిన చిలుక సతీశ్ రెండోసారి నియామకమయ్యారు. తన నియామకానికి కృషిచేసిన టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్, సీనియర్ నాయకులకు సతీశ్ కృతజ్ఞతలు తెలిపారు.

ఎలిగేడు మండల అధ్యక్షుడిగా రాజేశ్వర్‌రెడ్డి


రాజేశ్వర్‌రెడ్డి

ఎలిగేడు: మండలంలోని లాలపల్లికి చెందిన సామ రాజేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా రెండోసారి నియామకమయ్యారు. తన నియామకానికి కృషి చేసిన పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, జిల్లా అధ్యక్షుడు ఎం.ఎస్ రాజ్‌ఠాకూర్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావుకు రాజేశ్వర్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బలహీనవర్గాల అభ్యున్నతి బీఎస్పీతో సాధ్యం


పార్టీలోకి ఆహ్వానిస్తున్న హనుమయ్య

పెద్దపల్లిరూరల్/ఓదెల: బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి బీఎస్పీతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసరి హన్మయ్య అన్నారు. పెద్దపల్లి మండలం ముత్తారం, ఓదెల మండలం కనగర్తి గ్రామాలకు చెందిన పలువురు నాయకులకు సోమవారం పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అగ్రవర్ణాల పాలనలో బలహీనవర్గాలకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. నాయకులు శంకర్, అంజయ్య, కృష్ణయ్య, అనిల్, ప్రశాంత్, సతీశ్, మహేశ్, రమేశ్, సదయ్య, రాకేశ్, వెంకటస్వామి పాల్గొన్నారు.